అమరుల త్యాగాలు మరువలేనివి

- వారి స్ఫూర్తితో విధులకు పునరంకితం అవుదాం
- డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్
- పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

హాజరైన కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, డీఐజీ, ఎస్పీ, జిల్లా న్యాయాధికారి, ప్రజా ప్రతినిధులు


సెల్యూట్ చేస్తున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజ భద్రత, రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధులకు పునరంకితం అవుదామని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయుధ బలగాల నుంచి డీఐజీ, ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. దేశ అంతర్గత భద్రతలో పోలీసుల పాత్ర కీలకమని డీఐజీ అన్నారు. నేరాల నియంత్రణ, ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేస్తున్నారని అన్నారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు ఉద్యోగంలో చేరే ముందు అందరూ ఒకే తరహా ప్రతిజ్ఞ చేస్తారని అన్నారు. ఆ ప్రతిజ్ఞ సారాంశానికి అనుగుణంగా ప్రజలు, సమాజం కోసం నిరంతరం పని చేద్దామని డీఐజీ పిలుపునిచ్చారు.

● ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసు దళాల పాత్ర కీలకమని ఎస్పీ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ఉగ్రవాదులు, మత చాందసవాదులు, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు త్యాగాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. సమాజం ప్రశాంతంగా ఉండాలంటే పోలీసు సేవలు తప్పనిసరి అన్నారు. పోలీసులను కుటుంబంలో భాగంగా భావించాలని ప్రజలను కోరారు. పోలీసులపై విశ్వాసం పెంచుకోవాలని, ప్రజా సేవయే తమ పరమావధి అని అన్నారు. పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు.

● పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ అన్నారు. కొవిడ్ సమయంలో దేశంలో అన్ని రకాల యూనిఫాం ధరించిన పోలీసులు మంచి సేవలు అందించారని కొనియాడారు. వీఐపీల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర అమోఘమని అన్నారు. అహర్నిశలు పనిచేస్తూ, ప్రాణాలను ఫణంగా పెడుతున్న పోలీసులకు ఇచ్చే పరిహారం రెట్టింపు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు.


● పోలీసుల సేవలు మరువలేనివని, ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేనిదని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పోలీసులు కుటుంబాలకు దూరంగా ఉంటారని, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నారని కొనియాడారు. ప్రాణాలను ఫణంగా పెడుతున్న పోలీసులకు సెల్యూట్ అని అన్నారు. అనంతరం డీఐజీ, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు.

ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో గత ఏడాది మృతి చెందిన పోలీసులు, హోంగార్డు కుటుంబాలకు పోలీసు అధికారులు చెక్కుల రూపంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరజమ్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, ఏఎస్పీ రమణమూర్తి, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డీఎస్పీ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, సాయినాథ్, హేమంత్‌కుమార్, కరుణాకర్, ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, దేవానంద్, రఘుప్రసాద్, ఖాదర్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, మధు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

ధరహాసమేదీ..?



- భారీగా పడిపోయిన ద్రాక్ష ధర
- కొనుగోలు చేయని వ్యాపారులు
- పొలంలోనే కుళ్లిపోతున్న పంట
- రూ.లక్షల్లో నష్టపోతున్న రైతులు

6

ఇప్పుడైనా..!

వైసీపీ పాలనలో తమను ఓడీపై చిత్తూరుకు పంపి అన్యాయం చేశారని ఉమ్మడి జిల్లా ఎంపీఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. , అరకొర జీతానికి అక్కడి వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమను తిరిగి సొంత జిల్లాకు రప్పించాలని వేడుకుంటున్నారు.

6

చిట్టీల పేరిట రూ.2 కోట్ల టోకరా

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యాపారి చిట్టీల పేరిట రూ.2 కోట్ల మేరకు టోకరా వేశాడు. కుటుంబ సమేతంగా ఉడాయించాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మెయిన్ బజారులో బాలకృష్ణ అనే వ్యాపారి పలు ఏజెన్సీలను నిర్వహిస్తున్నాడు. వ్యాపారులతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆసరాగా చేసుకుని చిట్టీలు నిర్వహించేవాడు. గుత్తి, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన అనేక మంది ఇతని వద్ద రూ.లక్షల్లో చీటీలు వేశారు. గత నెల 29న బాలకృష్ణ కుటుంబ సమేతంగా ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు అతని కోసం పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు. బాధితుల్లో తిమ్మారెడ్డి రూ.3 లక్షలు, నాగేశ్వరెడ్డి రూ.లక్ష, శ్రీధర్ రూ.6 లక్షలు, పద్మజ రూ.4 లక్షలు, రఘునాథ్ రూ.4 లక్షలు, క్రిష్ణవేణి రూ.2 లక్షలు రావాల్సి ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు 300 మంది వరకూ ఉన్నారని రూ.2 కోట్లతో ఉడాయించాడని వాపోయారు. న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు.

పాత ఫిర్యాదులే మళ్లీ రాకూడదు: కలెక్టర్

అనంతపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజావేదికకు మళ్లీ మళ్లీ అవే ఫిర్యాదులు రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 363మంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతో పాటు జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ప్రజాఫిర్యాదులు, పరిష్కారాలపై అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఆదేశించారు. గడువులోగా ఆయా అర్జీలను పరిష్కరించాలన్నారు. కొన్నిశాఖలు ఫిర్యాదుల పరిష్కారంలో చిత్తశుద్ధిగా వ్యవవహరించడంలేదన్నారు. కానీ పరిష్కరించినట్లు చూపుతున్నారన్నారు. అందుకే బాధితులు మళ్లీ గ్రీవెన్స్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. యల్లనూరు ఇసుకరీచ్ వెంటనే మొదలు పెట్టాలని మైన్స్ డీడీని ఆదేశించారు. రచ్చుమర్రి ఇసుకరీచ్‌కూడా పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సహకారబ్యాంకులు, సొసైటీలలో ఈనెలాఖరులోగా కంప్యూటరీకరణ పూర్తికావాలని ఆదేశించారు. ప్రభుత్వంలోని అన్నిశాఖలు ఇకనుంచి ఈఆఫీస్‌లోనే ఫైళ్లు పంపాలని అధికారులను ఆదేశించారు.

రాంగ్ నంబర్..!

- రెండు కుటుంబాల్లో చిచ్చు పెట్టిన కాల్
- వివాహితుల మధ్య వివాహేతర సంబంధం
- ఫలితం.. ఒక హత్య.. యావజ్జీవ కారాగార శిక్ష


హత్య జరిగిన స్థలం (ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక రాంగ్ నంబర్ వివాహేతర సంబంధానికి దారితీసింది. కాపురంలో చిచ్చుపెట్టి.. హత్యకు కారణమైంది. ఆ కేసులో ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడేలా చేసింది. ఒక భర్తకు భార్యను శాశ్వతంగా దూరం చేసింది. భర్త జైలుపాలు కావడంతో మరో మహిళకు, ఆమె పిల్లల జీవితం అగమ్యగోచరంగా మారింది. కంబదూరు మండలం కదిరి దేవరపల్లికి రుద్రేష్ ఎంఏ వరకూ చదివాడు. ఆయన భార్య పార్వతి బీఈడీ పూర్తి చేశారు. ఇద్దరూ కలిసి కళ్యాణదుర్గంలో ట్యూషన్స్ చెప్పుకుంటూ జీవనం సాగించేవారు. ఒక రోజు రుద్రేష్‌కు విజయలక్ష్మి అనే మహిళ నుంచి రాంగ్ కాల్ వచ్చింది. అంతటితో ఆగకుండా.. పరిచయం పెరిగి.. వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే వివాహం జరిగింది. ఏడాదిన్నర వయసున్న కొడుకు ఉన్నారు. ఆ బంధాలను మరిచి.. వివాహేతర సంబంధాన్ని కొనసాగించారు. అర్ధరాత్రి ప్రైవేట్ ఫొటోలను, మెసేజ్‌లను పంపుకునేవారు. రుద్రేష్ భార్య వాటిని చూడటంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. చివరికు రుద్రేష్ దంపతులు విడిపోయే పరిస్థితి వచ్చింది. విషయం తెలుసుకున్న విజయలక్ష్మి 'నువ్వు నీ భార్యను వదిలిరా.. నేను నా భర్తను వదిలేసి వస్తాను. ఇద్దరం పెళ్లి చేసుకుందాం' అని ప్రతిపాదించింది. ఆ తరువాత ఒత్తిడి చేయడం ప్రారంభించింది. 'నీ భార్యను వదిలి రాకపోతే వాట్సప్ మెసేజ్‌లు, ఫొటోలు పోలీసులకు ఇచ్చి కేసు పెడతా' అని బెదిరించేది. దీంతో ఒత్తిడికి గురైన రుద్రేష్. ఆమెను హత్య చేసైనా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 2018 సెప్టెంబరు 4న రుద్రేష్‌కు విజయలక్ష్మి ఫోన్ చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మరుసటి రోజు ఇంటి నుంచి బయటకు వస్తున్నానని, అనంతపురానికి రావాలని చెప్పింది. ఇదే అదనుగా భావించిన రుద్రేష్.. ఐదో తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురం చేరుకున్నాడు.

గుట్ట వద్దకు తీసుకెళ్లి..

విజయలక్ష్మిని తన స్కూటీలో ఎక్కించుకుని అనంతపురం నుంచి కూడేరు మండలం ఉదిరిపికొండ-శివరాంపేట గ్రామాల మధ్య.. దారి పక్కనున్న ఓ గుట్ట వద్దకు రుద్రేష్ తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నారు. ఆ తరువాత విజయలక్ష్మి గొంతుకు చీరకొంగు బిగించి రుద్రేష్ హత్య చేశాడు. అనంతరం అక్కడే ఉన్న బండరాయితో ఆమె తలపై మోదాడు. ఆమె ఒంటిపై నగలను తీసుకుని అదే రోజు కళ్యాణదుర్గంలోని ఓ గోల్డ్ లోన్ సంస్థ వద్ద తాకట్టుపెట్టి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఆ డబ్బుతో తన భార్య పార్వతికి నల్లపూసల దండ కొనేందుకు ఓ నగల దుకాణంలో రూ.30 వేలు అడ్వాన్స్ ఇచ్చాడు. మరుసటి రోజు ఎల్‌ఈడీ టీవీ కొనుగోలు చేశాడు.


జైలుపాలైన రుద్రేష్

మిస్సింగ్ కేసుతో..

ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన తన భార్య తిరిగి రాలేదని విజయలక్ష్మి భర్త అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రెండు రోజుల తరువాత విజయలక్ష్మి మృతదేహం గుట్ట వద్ద కనిపించింది. విజయలక్ష్మి సెల్‌ఫోన్, సీసీ ఫుటేజీ ఆధారంగా రుద్రేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ప్రసాదరావు కేసును దర్యాప్తు చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. జిల్లా సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ 15 మంది సాక్షులను విచారించి.. రుద్రేష్ నేరం చేశాడని నిర్ధారించారు. ఈ కేసులో తీర్పును సోమవారం వెలువరించారు. ఐపీసీ సెక్షన్ 302 కింద రుద్రేష్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. సెక్షన్ 404 కింద మరో 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని ప్రకటించారు. ప్రాసిక్యూషన్ తరఫున హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు. సీఐ ప్రసాద్‌రావు, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు రామమోహన్, రాముడు, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులును ఎస్పీ జగదీష్ అభినందించారు. రుద్రేష్‌కు భార్య పార్వతి, మూడు, రెండు సంవత్సరాలు కలిగిన ఇద్దరు చిన్న పిల్లలున్నారు. విజయలక్ష్మి రాంగ్ ఫోన్ కాల్ ద్వారా పరిచయమైన 32 రోజుల్లోనే హత్య జరిగింది.


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అబద్ధాలు మానుకో అనంతా..!

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అబద్ధాలు మానుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సూచించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో రైతులకు ఇచ్చినంత పంటల బీమా, పంట నష్ట పరిహారం వైసీపీ హయాంలో ఇచ్చారా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో అరకొరగా డ్రిప్ పరికరాలు సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జిల్లాలో ఈ ఏడాది 35 వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు. మద్యం షాపుల లాటరీలో సామాన్యులు సైతం పాల్గొనేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యేలంతా మద్యం వైపే చూస్తున్నారని అనంత మాట్లాడటం పద్ధతి కాదని అన్నారు. మద్యపాన నిషేధం హామీని విస్మరించి.. మద్యాన్ని ఏరులై పారించి సొమ్ము చేసుకోలేదా అని నిలదీశారు. ఎద్దుల బండ్లతోపాటు ట్రాక్టర్‌తో కూడా ఇళ్ల అవసరాల కోసం ఇసుకను తీసుకువెళ్లవచ్చని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారని అన్నారు. ఇబ్బంది పెడితే సస్పెండ్ చేస్తానని అధికారులను హెచ్చరించారని, ఇంతకంటే స్పష్టత ఇంకేం కావాలని నిలదీశారు.

మాట్లాడే అర్హత ఉందా: దగ్గుపాటి

రైతుల గురించి మాట్లాడే కనీస అర్హత అనంతకు లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజైనా రైతుల సంక్షేమాన్ని పట్టించుకుదా అని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత మొట్టమొదటి ఆలోచించింది రైతుల గురించేనని అన్నారు. వైసీపీ హయాంలో రైతులకు పెట్టిన బకాయిల్లో ఇప్పటికే రూ.1400 కోట్లను తమ ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. ఐటీ విషయంలో యువతను ప్రోత్సహించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో చంద్రబాబు ముందుకు వెళుతున్నారని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు లోఫరో.. ఎవరు జోకరో ప్రజలకు బాగా తెలుసునని అన్నారు.

తాగునీటి పథకాలకు రూ.62 కోట్లు

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్


నీటి పంపింగ్ పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

ఉరవకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాలకు రూ.62 కోట్లు వెచ్చిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. పీఏబీఆర్ డ్యాం వద్ద తాగునీటి పథకాల ఫిల్టర్, పంపింగ్ స్టేషన్‌ను అధికారులతో ఆయన సోమవారం పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సత్యసాయి తాగునీటి పథకానికి మూడు మోటార్లు ఉండగా.. ఒకటి మాత్రమే పనిచేస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఇంద్రావతి వద్ద హంద్రీనీవా కాలువ నుంచి నింబగల్లు చెరువుకు నీటి పంపింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. నూతన తాగునీటి పథకాల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో తాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేసిందని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు తాగునీటిని అందించేందుకు రూ.62 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకూ పైప్‌లైన్ పనులను త్వరలోనే మొదలు పెడతామని అన్నారు. హంద్రీనీవా కాలువ వరకూ ఏప్రిల్ వరకూ నీరు వచ్చే అవకాశం ఉందని, ఇంద్రావతి నుంచి నింబగల్లు వరకూ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు నింపేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నింబగల్లు చెరువు నుంచి ఉరవకొండ వరకూ ప్రత్యామ్నాయంగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నింబగల్లు, కొనకొండ్ల చెరువుల వద్ద ఫిల్టర్‌బెడ్లు దయనీయంగా ఉన్నాయని, అక్కడ మైక్రోఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. గతంలో ఉరవకొండలో 10 రోజులకు ఒకసారి నీరు వచ్చేదని, ప్రస్తుతం ఐదు రోజులకు ఒకసారి వదులుతున్నామని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, ఉరవకొండ రూపురేఖలు మారుస్తామని అన్నారు. అనంతరం పీఏబీఆర్ డ్యాంలోని తాగునీటి పథకాలను కేశవ్ పరిశీలించారు. నీలకంఠపురం శ్రీరామ్‌రెడ్డి ప్రాజెక్టు మోటర్లను పరిశీలించారు. అక్కడే అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్యను అధిగమించడానికి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. కూడేరు స్కీంకు ఎస్ఎస్ఆర్‌డీడబ్ల్యూపీ ద్వారా ఇప్పుడు తీసుకుంటున్న 5 ఎంఎల్‌డీ వాటర్ సరిపడనందున, 15 ఎంఎల్‌డీ వాటర్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాలలో ఎస్ఈ మురళీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నస్రీన్, సత్యసాయి ప్రాజెక్టు డీఈ రామారావు, ఓఎండీ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, బీసీ మారెన్న, మాజీ

న్యూస్ బాక్స్

స్టాండర్డ్స్ పాటించాలి

● ప్రొఫెసర్ దేవకుమార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ దేవకుమార్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లో స్టాండర్డ్స్ పాటించాలని ఐఈఐ రాష్ట్ర గౌరవ కార్యదర్శి, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ దేవకుమార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాల ఎస్ఆర్ఐటీలో సోమవారం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ డేను ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ రఘుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ప్రొఫెసర్ దేవకుమార్, బీఐఈ డిప్యూటీ డైరెక్టర్ అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నొవేషన్‌లో యువ ఇంజనీర్లు మంచి స్టాండర్డ్స్ పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఈఐ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సివిల్ హెచ్‌ఓడీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థులను ప్రశంసిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ప్రవేశాలకు నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. విద్యార్థులు 26వరకు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తి అయిన విద్యార్థులకు 28న ప్రభుత్వ, 30న ప్రైవేట్ కళాశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. కాగా నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలందజేసి సత్కరించారు.

కుండపోత



వేదవతి హగరిలో భారీగా ప్రవహిస్తున్న వరదనీరు

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు వేదవతి హగరి పొంగిపొర్లాయి. పత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప తదితర పంటలు నీట మునిగాయి. భారీగా వరదనీరు రావడంతో వేదవతి హగరి ఉప్పొంగి ప్రవహించింది. మండలంలోని ఉద్దేహాళ్, గోనేహాళ్, శ్రీధరఘట్ట, సింగానహళ్లి తదితర గ్రామాలలో కుండపోత వర్షం కురిసింది. సిద్ధరాంపురం, కురవళ్లి గ్రామాలలో మిరప, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి.

కోచింగ్‌కు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నిర్వహించనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 21 వరకు ఉన్న గడువును 25 తేదీ వరకూ పొడిగించినట్లు ఆమె తెలిపారు.

సమావేశం వాయిదా

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగుప్ప వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు ఈనెల 23న అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ లో సమావేశాన్ని నిర్వహించడంతోపాటు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అనంతపురం డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అనంతపురం అర్బన్ సీడీపీఓ లలిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, శింగనమల, నార్పల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టులోని కూడేరు మండలాలల్లో అంగన్వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపిక పారదర్శకంగా సాగుతుందని, మధ్యవర్తులను నమ్మవద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇప్పుడైనా..!

● ఓడీ రద్దు కోసం ఎంపీఈఓల విశ్వప్రయత్నాలు
● చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న 106 మంది
● జిల్లాకు రప్పించాలని ప్రజాప్రతినిధులకు వినతి
● ఖరీఫ్ ఈ-పంట నమోదు తర్వాత పంపుతామన్న ఉన్నతాధికారులు
● హామీ అమలు కోసం నిరీక్షిస్తున్న చిరుద్యోగులు



రైతు సేవా కేంద్రం

అనంతపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సొంత జిల్లాకు రావడానికి ఎంపీఈఓలు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ పాలనలో తమను ఓడీపై చిత్తూరుకు పంపి అన్యాయం చేశారని, మీరే న్యాయం చేయాలని ఇదివరకే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి విన్నవించారు. అలాగే వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావులను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. జిల్లా ప్రతినిధులతో సైతం సంబంధిత మంత్రి, అధికారులకు లేఖలు రాయించారు. గత జూలైలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీఈఓలను జిల్లాకు రప్పించాలని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సైతం కోరారు. దీంతో వ్యవసాయ కమిషనరేట్‌కు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి లేఖ పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ ఈ- పంట నమోదు పూర్తయిన తర్వాత ఓడీలు రద్దు చేసి అనంత జిల్లాకు పంపుతామని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఎంపీఈఓలకు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు ఈకేవైసీ పూర్తయినా ఇప్పటి దాకా ఇచ్చిన హామీ అమలు కాలేదు. దీంతో ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అరకొర జీతానికి అంతదూరమా..?

టీడీపీ పాలనలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓ (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లను కాంట్రాక్టు పద్ధతిపై ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశు సంవర్ధక శాఖ తరఫున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పని చేసేవారు. వీరిలో 175 మంది వీఏఏలు పోస్టులకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 4వేల ఎకరాల నుంచి 6వేల ఎకరాలకు ఒక ఆర్బీకేను ఏర్పాటు చేశారు. తద్వారా ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో జరగని విధంగా అనంత జిల్లా ఎంపీఈఓలను చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. 2021, 2022 సంవత్సరాల్లో రెండు విడతలుగా 253 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 106 మంది ఉమ్మడి చిత్తూరులో ఓడీపై పనిచేస్తున్నారు. మిగిలిన వారు అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ సమస్యలతో అక్కడ పనిచేయలేక తిరిగి వచ్చారు. వీరిలో 70 శాతం మంది మహిళా సిబ్బంది ఉండటం గమనార్హం. పేద కుటుంబాలకు చెందిన ఆ సిబ్బంది రూ.12వేల జీతం కోసం వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు దూరంగా ఉంటూ పని చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో జనాభా ప్రతిపదికగా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. 60 ఎకరాల నుంచి 500 ఎకరాల పరిధిలో కూడా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. దీంతో వాటి సంఖ్య పెరిగింది. అనంత జిల్లాలో ఎక్కువ విస్తీర్ణానికి ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది.



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీఈఓలు

ముమ్మరంగా వినతులు

వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు ఎంపీఈఓలను పంపాలని నిర్ణయించిన నాటి నుంచి ఎంపీఈఓల సంఘం నాయకులు ఓడీ రద్దు చేసి, జిల్లాలోనే కొనసాగించాలని అప్పటి ప్రజాప్రతినిధులను అనేక సార్లు విన్నవించారు. ఉమ్మడి జిల్లాలో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవిస్తూ వచ్చారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశతో బాధిత ఎంపీఈఓలు పలు మార్లు కూటమి ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఇకమీదట ఏమి చేయాలో తోచని అయోమయంలో పడ్డారు.

కుటుంబానికి దూరంగా..



నాది చెన్నేకొత్తపల్లి మండలం. వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు పంపారు. నా భర్త రైతు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయికి ఆరేళ్లు, కుమారుడికి నాలుగేళ్లు. కుటుంబ అవసరాల రీత్యా తక్కువ వేతనమైనా తప్పని పరిస్థితుల్లో ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నా. పిల్లలను తలచుకుంటే కన్నీళ్లు వస్తాయి. నా భర్తే వారి ఆలనాపాలన చూస్తున్నారు. సెలవు రోజుల్లో ఊరికి వెళ్లి పిల్లలను చూసుకుంటున్నా. నాతోపాటు ఎక్కువ మంది మహిళలే ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. అందరూ నాలాగే ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాం.

- నాగేశ్వరి, వ్యవసాయ శాఖ ఎంపీఈఓ



తిరుపతిలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావులకు వినతి పత్రం అందజేస్తున్న బాధిత ఎంపీఈఓలు

తక్షణమే ఓడీలు రద్దు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ ఈ పంట నమోదు పూర్తికాగానే ఓడీలు రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్‌లు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదు ఇప్పటికే పూర్తి చేశాం. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఓడీలు రద్దు చేసి, సొంత జిల్లాకు పంపాలి. కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు మేము వెళ్లిన ప్రతి సారి సానుకూలంగానే స్పందిస్తున్నారు. త్వరలో న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● రాయలసీమకు రూ.10వేల కోట్లు కేటాయించాలి
● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్
● కలెక్టరేట్ వద్ద ముగిసిన సీపీఎం బస్సు యాత్ర



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. జిల్లాకు సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19వ వరకు జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టారు. యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంఏ గఫూర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అధ్వానంగా మారిందని విమర్శించారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులను పూర్తి చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా వెడల్పు చేస్తామని చెప్పిన హామీని విస్మరించారని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లాకు చెందిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపి సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ 14 సంవత్సరాలు గడుస్తున్నా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణను ప్రభుత్వాలు పూర్తిచేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 2008లో చేపట్టిన హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ సాగునీటికోసం చేస్తున్న పోరాటం ఇంతటితో ఆగదని, ప్రభుత్వంలో చలనం తీసుకొచ్చేవరకూ సాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం నగర ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, నాగమణి, రామాంజనేయులు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పటి డిమాండ్లు.. ఇప్పుడు నెరవేర్చండి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ వివిధ డిమాండ్లతో ఆందోళనలు చేసిందని, ఇప్పుడు అధికారంలో ఉన్నందు న వాటన్నింటిని నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన విలేకఖరుల సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రజాహిత పరిపాలనను తాము స్వాగతిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన ప్రజలు పాత పథకాలు, పాత ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా వైడెనింగ్, రాగులపాడు లిఫ్టు, డ్రిప్ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందన్నారు. వాటన్నింటినీ పూర్తిచేసి, ఆశించిన మేరకు సాగునీరు అందించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందని గుర్తు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో నాలెడ్జి హబ్‌ను సాకారం చేయాలన్నారు. చార్జీలను పెంచడానికి విద్యుత్ శాఖ సమాయత్తమౌతోందని, కరెంటు చార్జీలను పెంచరాదన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేయాలన్నారు. సమావేశంలో గోవిందు, వీరభద్రస్వామి, మహమ్మద్ గౌస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో చేరడానికి 18ఏళ్ల నుంచి 50ఏళ లోపు ఉన్న మహిళలు అర్హులన్నారు. ఈ బీమాలో చేరినవారు సహజంగా మరణించినా ఆకుటుంబానికి రూ. 2లక్షలు పరిహారం ఇస్తారన్నారు. ఒకవేళ ప్రమాదంలో మరణించినా అంతేమొత్తం పరిహారంగా ఇస్తారన్నారు. 51సంత్సరాల నుంచి 70ఏళ్లలోపు వారికోసం ప్రధాన మంత్రి సురక్షాబీమా యోజన ద్వారా ప్రమాదంలో మరణిస్తే రూ.2లక్షలు పరిహారం ఇస్తారని తెలిపారు. ఈ రెండు పథకాలలో సభ్యత్వం పొందడానికి ఏడాదికి రూ.456లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు ఈ బీమా పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన మహిళలను చేర్పించాలని కోరారు.

ధరహాసమేదీ..?

● భారీగా పడిపోయిన ద్రాక్ష ధర
● కొనుగోలు చేయని వ్యాపారులు
● పొలంలోనే కుళ్లిపోతున్న పంట
● రూ.లక్షల్లో నష్టపోతున్న రైతులు



నేల రాలిన ద్రాక్ష



బండమీదపల్లిలో పొలంలోనే కుళ్లిపోయిన ద్రాక్ష

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ధర లేకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ద్రాక్ష రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనేవారు లేక పంట కుళ్లిపోతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు, చెర్లోపల్లి, బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి, కొత్తపల్లి, బొమ్మేపర్తి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా ద్రాక్ష పంట సాగు చేస్తారు. పందిరి ఏర్పాటు చేసి సీడ్‌లెస్, సీడ్, నల్ల, తెల్ల ద్రాక్ష సాగు చేశారు. సీడ్‌లెస్ ద్రాక్ష 250 ఎకరాలు, సీడ్ ద్రాక్ష 100 ఎకరాలు వరకూ సాగు చేశారు. గతేడాది ద్రాక్ష ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు చేసిన రైతులకు శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల్లో రైతులు ద్రాక్ష సాగు చేశారు. సకాలంలో మందులు పిచికారీ చేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంట చేతికందే సమయంతో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీడ్‌లెస్ ద్రాక్ష గతేడాది టన్ను రూ. 50 వేల నుంచి రూ.70 వేల వరకూ అమ్ముడుపోయింది. ఈ ఏడాది రూ. 20 వేలకు కూడా వ్యాపారులు అడగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ ద్రాక్ష కూడా గతేడాది టన్ను రూ. 50 వేల వరకూ పలికింది. ఈ ఏడాది సీడ్ ద్రాక్షను వ్యాపారులు అడగడమే లేదని రైతులు వాపోతున్నారు. ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలంలోనే పంట కుళ్లిపోతోంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, కొనేవారు లేక తీవ్రంగా నష్టపోతున్నామని ద్రాక్ష రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధరలు తగ్గాయి

ఆగస్టు వరకూ ద్రాక్ష ధర బాగానే ఉండేది. రెండు నెలల నుంచి ధరలు తగ్గాయి. సీడ్ ద్రాక్ష పులుపు ఉండటంతో ఇక్కడి ప్రజలు తినడానికి ఇష్టపడరు. ఈ ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేసి అస్సోం, బెంగాల్, బంగ్లాదేశ్ ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం వారు కూడా సీడ్ ద్రాక్షను కొనేందుకు ఆసక్తి చూపడం లేదు.

-రత్నకుమార్, ఉద్యానశాఖ అధికారి

రూ.8 లక్షలు ఖర్చు పెట్టా..



ఆరేళ్ల కిందట ద్రాక్ష సాగు చేయడం ప్రారంభించా. పందిరి ఏర్పాటు చేసి దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగు చేశా. ప్రతి ఏడాది ధరలు బాగా ఉండటంతో శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో ద్రాక్ష సాగుకు రూ. 8 లక్షలు ఖర్చు పెట్టా. దాదాపు 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనడం లేదు.

- ప్రసాద్, బండమీదపల్లి

పొలంలోనే కుళ్లిపోతోంది



ఒకటిన్నర ఎకరాలో దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగుకు రూ. 5లక్షలు ఖర్చు చేశా. ఏడాది కాలం పంటకు తెగుళ్లు, వైరస్‌లు రాకుండా జాగ్రత్తగా కాపాడుకున్నాం. ఆగస్టు వరకూ టన్ను ద్రాక్ష రూ. 50 వేలు ఉండేది. రెండు నెలల నుంచి ద్రాక్ష ధరలు చాలా తగ్గాయి. టన్ను ద్రాక్ష రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనుగోలు చే యడం లేదు. వర్షాలకు ద్రాక్ష కుళ్లిపోయి పొలంలోనే రాలిపోతోంది. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించాలి.

- వెంకటనాయుడు, బండమీదపల్లి

126 అంకెలు కాదు... బాలుడి పేరు

● అన్ని రికార్డుల్లోనూ అదే పేరు



126 పేరు ఉన్న బాలుడు

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అభిరుచి ఉంటుంది. అది వారు ఆదర్శం కోసం చేసినా ఇతరులకు మాత్రం వైవిధ్యంగా కనిపిస్తుంది. ఇలాంటి కోవకు చెందినదే ఓ పిల్లాడికి పెట్టిన పేరు. సాధారణంగా తమ పిల్లలకు దేవుడికి సంబంధించినది కానీ తమ పూర్వీకులకు సంబంధించిన పేరు కానీ పెట్టుకుంటారు. ఇంకా కొందరు వెరైటీ కోసం ఇంటర్‌నెట్‌లో చూసి వినూత్నంగా ఉండేలా పెడతారు. కానీ తాడిపత్రికి చెందిన ఓ టీచర్ తన కుమారుడికి అంకెలతో పేరు పెట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాడిపత్రిలోని సుంకులమ్మపాలెంకు చెందిన రాఘవేంద్ర, ప్రశాంతి దంపతులు తమ కుమారుడికి 126 అంటూ అంకెలతో పేరు పెట్టారు. రాఘవేంద్ర పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆధార్‌కార్డు, డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్, పాఠశాల రికార్డుల్లో కూడా 126గా నమో దు చేయించాడు. ఎందుకిలా అని ప్రశ్నిస్తే 126 అంకెల్లో 1 అంటే ఐ, 2 అంటే యామ్, 6కి ఇండియన్ అని అర్థం వచ్చేలా పెట్టానన్నా రు. కుల, మత బేధాలు ఉండకుండా అందరూ భారతీయులుగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే తాను ఈ పేరు పెట్టినట్లు తెలిపారు. తన కుమారుడికి ప్రస్తుతం ఆరేళ్ల వయసు ఉన్నా, పుట్టిన కొన్నిరోజులకే 126పేరు పెట్టానని, ప్రస్తుతం ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలిపాడు. కుమారుడు పుట్టకమునుపే ఈ పేరు పెట్టాలని ఆలోచించి పెట్టుకున్నానని ఆయన తెలిపారు.



తల్లిదండ్రులతో.. 126

సంక్షిప్తం

టమోటా కిలో రూ.50



అనంతపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.37, కనిష్ఠ ధర రూ.26పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1174 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1160 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

25న జాబ్‌మేళా

అనంతపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని మాస్టర్ మైండ్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. ముత్తూట్ గ్రూప్, టాటా ఎల్రానిక్స్, క్యాపిటల్, ఐఐఎఫ్ఎల్ సంస్థ, బి-న్యూ, ఎస్‌బిఐకార్డ్స్ సంస్థలు జాబ్‌మేళాలలో పాల్గొంటాయన్నారు. కనీస విద్యార్హత ఇంటర్, డిగ్రీ పాస్ అయి ఉండి..18నుంచి 30ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు 8143420834నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుట్టగొడుగులు తిని పలువురికి అస్వస్థత

చిలమత్తూరు/హిందూపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొలంలో వర్షానికి పుట్టుకొచ్చిన పుట్టుగొడుగులు తిని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. చిలమత్తూరు మండలంలోని ఆదెప్పల్లికి చెందిన వెంకటశివప్ప ఉదయం పొలంలోకి వెళ్లి వస్తుండగా పుట్టుగొడుగులు కనిపించాయి. ఆయన వాటిని కోసుకొని ఇంటికి తీసుకొచ్చాడు. పుట్టుగొడుగులు పూర్తిగా విచ్చుకోవడమే కాకుండా వాటిలో కొన్ని ముందురోజున మొలకొత్తినవి కావడంతో అవి ఫంగస్ సోకి ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించకుండా తీసుకొచ్చిన వాటన్నింటినీ వండుకుని తిన్నారు. దీంతో వాటిని తిన్న ఇంట్లోని వారందరికీ వాంతులు, విరోచనాలు అయి, తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. స్థానికులు 108 వాహన సాయంతో వెంకటశివప్పతోపాటు కుటుంబ సభ్యులు అలివేలమ్మ, శాంతమ్మ, శ్రీనివాసులు, గంగ, శివ, లక్ష్మిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

కోలుకోలేని దెబ్బ..

చేనేత పరిశ్రమకు భారీ వర్షాల ఎఫెక్ట్
మగ్గం గుంతల్లోకి చేరిన నీరు
మరో వారం రోజులు పనులకు ఆటంకం
ఉపాధి కోల్పోతున్న నేతన్నలు
రూ.2కోట్లకుపైగా నష్టం

ధర్మవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న చేనేత పరిశ్రమను భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. చేనేత పరిశ్రమకు పెను నష్టం మిగులుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో మగ్గం నేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లావ్యాప్తంగా 50 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పరిశ్రమపై ఆధారపడిన వారు ఉపాధి కోల్పోతున్నారు. వారం రోజుల్లో రూ.2కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు చేనేత వర్గాలు నేర్కొంటున్నాయి. ఒక్కో చేనేత కార్మికుడు నెలకు 5 నుంచి 6 చీరలు నేస్తాడు. ఒక్కో చీరకు చీరకు సగటున కూలి రూపంలో రూ.4వేలు దక్కుతుంది. ఈ మొత్తం చేనేత కార్మికులు నష్టపోతున్నారు. మాస్టర్ వీవర్స్ కూడా అంతేస్థాయిలో నష్టపోతున్నారు.

పరిశ్రమ అతలాకుతలం

భారీ వర్షాలు కురిశాయంటే చేనేత పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పట్టుచీర తయారు చేసే రేషం దారానికి తేమ అవడంతో మగ్గాలు ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలో 70 శాతం మంది ధర్మవరంలోనే చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏ ఇంటికెళ్లినా మగ్గాలు కనిపిస్తాయి. వాటి శబ్దాలు వినిపిస్తాయి. వర్షాల కారణంగా మగ్గం మూగబోయింది.



తడిసిన మగ్గం సామాన్లను ఆరపెట్టిన దృశ్యం

మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందేమోనన్న భయంతో మగ్గాలను చుట్టేశారు. పనులు లేక ఖాళీగా గడుపుతున్నారు. వారం రోజులపాటు పనులు లేకపోవడంతో పరిశ్రమ అతలాకుతలమైంది.

ధర్మవరంలో భారీ నష్టం

ధర్మవరంలోని దిగువ ప్రాంతాలైన చంద్రబాబునగర్, శాంతినగర్, సంజయ్‌నగర్, జోగోనికుంట, పార్థసారథి నగర్, శివానగర్, కేశవనగర్ తదితర ప్రాంతాల్లో మగ్గం గుంతల్లోకి నీరు చేరడం, ఊట ఏర్పడటంతో మగ్గాలను పూర్తిగా చుట్టిపెట్టారు. వారంరోజులుగా పనులు లేక చేనేత కార్మికులు పస్తులుండే పరిస్థితి దాపురించింది. వాతావరణ శాఖ మళ్లీ వర్షాల హెచ్చరిక జారీ చేస్తుండడంతో నేతన్నల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.

ఆ పథకాన్ని పునరుద్ధరించాలి

గత టీడీపీ హయాంలో ఆగస్టు నుంచి నవంబరు వరకు దాదాపు 4నెలలపాటు వర్షాలను దృష్టిలో పెట్టుకుని,



మగ్గం గుంతల్లోకి చేరిన వర్షపు నీరు

ఒక్కో చేనేత కుటుంబానికి రూ.4వేలతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పథకానికి మంగళం పలికింది. నేతన్నల పొట్టకొట్టిందని కార్మికసంఘాలు మండిపడుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో కష్టకాలంలో ఆదుకుంటుందని చేనేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పథకాన్ని పునరుద్ధరించాలని కార్మికసంఘాలు కోరుతున్నాయి.

వారం రోజులుగా ఉపాధిలేదు



వరుస వర్షాల కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. మగ్గం సామగ్రి పూర్తిగా తడిసిపోయాయి. నీరు నిల్వ ఉండటంతో వారం రోజులుగా ఉపాధి కోల్పోయాం. మగ్గం సామగ్రి ఆరబెట్టడానికి 15 రోజులు పడుతుంది. అప్పటి వరకు పస్తులుండాల్సి వస్తోంది. ప్రభుత్వం వర్షాకాల భృతి అందించి, ఆదుకోవాలి.

- రంగం బాలక్రిష్ణ, చేనేత కార్మికుడు, మాధవనగర్

పురానికి క్రీడాసంబరం

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్
వాలీబాల్ పోటీలు ప్రారంభం
26 జిల్లాల నుంచి 600 మంది రాక



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారిణులు

హిందూపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి క్రీడా పండుగ వచ్చింది. ముద్దిరెడ్డిపల్లిలో 68వ రాష్ట్రస్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలకు శ్రీకారం చుట్టారు. ఆయా జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. క్రీడాకారుల గౌరవ వందనాన్ని శాప్ చైర్మన్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. నందమూరి తారకరామారావు 1986లోనే హిందూపురంలో ఇండోర్ స్టేడియం నిర్మించారన్న విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2027లో జాతీయస్థాయి క్రీడాపోటీలు రాష్ట్రంలో నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గత వైసీపీ హయాంలో క్రీడలు, క్రీడాకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఎంపీఆర్ (మిడ్‌పెన్నార్) డ్యాం నుంచి ఉత్తర కాలువకు సాగునీరు సోమవారం విడుదల చేశారు. మండల టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి గంగపూజ చేసి ఉత్తర కాలువకు నీరు విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమను రతనాలసీమ చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఉత్తర కాలువకు సాగునీరు విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఎంపీఆర్ డ్యాం గేట్లు పాడైపోయి డ్యాంలో నీరంతా వృథాగా పోతున్న గత వైసీపీ ప్రభుత్వం స్పందించిన పాపన పోలేదని విమర్శించారు. దీపావళి పండుగ కంటే ముందే సాగునీరు విడుదల చేసి రైతుల కళ్లలో వెలుగులు చూడటం ఆనందంగా ఉందన్నారు. చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ చౌదరి, మునలిరెడ్డి, జింకల సంజీవకుమార్, పాల్గొన్నారు.



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

క్రైం కార్నర్

ఎంతపని చేస్తివి నాయనా ?

యువకుడి ఆత్మహత్యతో రోదించిన తండ్రి
రెండురోజుల తరువాత ఘటన వెలుగులోకి



కొప్పలకొండ మధు (ఫైల్)

గార్లదిన్నె, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్యం బాగాలేదు. ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నావా ? ఎంత పని చేశావు నాయనా' అంటూ కుమారుడి మృతదేహం వద్ద తండ్రి విలపించిన తీరు చూపరులతో కంటతడి పెట్టించింది. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన కొప్పలకొండ మధు(27) ఇంటర్మీడియట్ వరకూ చదువుకొని వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇతడికి ఏడాది కిందటే వివాహమైంది. కొద్దిగా అనారోగ్యంగా ఉందని, ఆసుపత్రికి వెళ్లి వస్తానని శనివారం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. పలుచోట్ల గాలించారు. అయితే కనుంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గల గుట్టలో మధు మృతదేహం, వాహనాన్ని గమనించిన గొర్రెలకాపరులు పోలీసులకు సమాచారం చేరవేశారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పురుగుల మందు డబ్బా, వాటర్ బాటిల్ ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. రెండు రోజులు కిందటే మృతి చెంది ఉంటాడని అభిప్రాయపడ్డారు. మృతదేహం నల్లగా మారిపోయింది. మృతదేహంపై ఉన్న దుస్తులు, ద్విచక్ర వాహనాన్ని పరిశీలించి, పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన మధుగా మృతుడిని గుర్తించారు. వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతుడు తమ కుమారుడే అంటూ బోరున విలపించారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాగా ఒడిషా, అరుణాచల్‌ప్రదేశ్ మ్యాచ్

మధ్యప్రదేశ్‌పై లడక్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మహిళా ఫుట్ బాల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రాజామాత జీజీబాయి సీనియర్ మహిళల జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు సోమవారం కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌పై లడక్ రెండు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ అరుణాచల్ ప్రదేశ్, ఒడిషా జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. చివరికి ఫలితం తేలకుండానే డ్రాగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డేనియల్ ప్రదీప్, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి మల్లేష్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రహ్లద్, సుదర్శన్, నాగరాజు, కోఆర్డినేటర్ దాదాకలందర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ కబడ్డీ జట్టు హ్యాట్రిక్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్కేయూ అంతర్ కళాశాలల గ్రూప్-బి పోటీలు సోమవారం ముగిశాయి. కబడ్డీ పోటీల్లో ఫైనల్ పోరు రసవత్తరంగా సాగింది. ఉత్కంఠగా సాగిన కబడ్డీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల జట్టుపై ఎస్ఎస్‌బీఎన్ 30పాయింట్ల తేడాతో గెలుపొంది హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే బాస్కెట్‌బాల్ పోటీలలో ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందగా, ఎస్కేయూ కాలేజీ రన్నర్‌గా నిలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎస్ఎస్‌బీఎన్‌పై ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఓవరాల్ చాంపియన్‌గా ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నిలిచింది. ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రాజు ముఖ్య అతిథులు గా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, వంశీ, సంధ్య, పీడీలు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మిద్దెకూలి చిన్నారికి తీవ్రగాయాలు





కల్లుకుంటలో కుప్పకూలిన ఇల్లు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి నీరజ

పెనుకొండ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని కల్లుకుంట గ్రామంలో పాత మిద్దె కూలి బాలాజీ కుమార్తె నీరజ(5)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలాజీ, అతడి భార్య సోమవారం పని నిమిత్తం బయటికెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వారు ఉంటున్న మిద్దె నానిపోయి, కూలింది. ఇంట్లో ఉన్న చిన్నారి నీరజ తీవ్రంగా గాయపడింది. చిన్నారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంలో మరో బాలుడికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

కాల్పుల ఘటనపై దర్యాప్తు ముమ్మరం

నకిలీ బంగారు ముఠాకు తెలంగాణ పోలీసుల వల..?
పట్టుకునే క్రమంలో ఎయిర్ గన్‌తో కాల్పులు..?
దర్యాప్తునకు శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెండు బృందాలు
తెలంగాణ, అన్నమయ్య జిల్లాల్లో విచారణ
పోలీసుల అదుపులో షికారుపాళ్యం ముఠా సభ్యుడు



పుట్టపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి మండలం రామాపురంలో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు విచారణ వేగవంతం చేశారు. కాల్పుల ఘటనలో పాల్గొన్నవారి వివరాలను ఆరా తీస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో ఆదివారం ఉదయం కాల్పుల ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రెండు బృందాలుగా విడిపోయి.. తెలంగాణ, అన్నమయ్య జిల్లాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా షికారుపాళ్యంకు చెందిన పేరుమోసిన నకిలీ బంగారు విక్రయించే ముఠా.. తెలంగాణ ప్రాంతంలో ఇటీవల భారీ మోసాలకు పాల్పడింది. చౌకగా బంగారు ఇస్తామని ఆశ చూపి పలువురిని మోసగించింది. ఈ ముఠాపై నిఘా పెట్టిన తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు.. ఆచూకీ కనుగొని వల వేశారు. తెలంగాణకు చెందిన కొందరిని రంగంలోకి దింపి.. తక్కువ ధరకు బంగారు కావాలని నకిలీ బంగారు ముఠాను కోరారు. శ్రీసత్యసాయి జిల్లా రామాపురానికి వస్తే బంగారు అందజేస్తామని షికారుపాళ్యం ముఠా చెప్పడంతో.. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు వెంట ఉండి.. కొనేవారిని రంగంలోకి దించారు. రెండు కార్లలో వారు రామాపురానికి ఆదివారం ఉదయం వచ్చారు. వచ్చింది పోలీసులని పసిగట్టిన షికారుపాళ్యం ముఠా పరుగులు తీసింది. వారిని అదుపులోకి తీసుకునేందుకు తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు ఎయిర్ గన్‌తో కాల్పులు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కాల్పులు జరిపిన వారి కారు నంబర్లను బత్తలపల్లి టోల్‌గేట్‌లో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు గుర్తించారు. తెలంగాణ కార్లుగా నిర్ధారించుకుని, వారికి ఫోన్ చేశారు. తాము తెలంగాణ సైబర్ క్రైం పోలీసులమని వారు ధర్మవరం పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నకిలీ బంగారం విక్రయించిన ముఠాను పట్టుకునేందుకే వచ్చామని, పారిపోతున్న ముఠాపై ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపామని వారు చెప్పినట్లు సమాచారం.

టీ-పోలీసుల పాత్ర లేదా..?

రామాపురంలో కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కాల్పుల్లో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసుల ప్రాతలేదని, నకిలీ బంగారు విక్రయించే రెండు ముఠాల మధ్య జరిగిన బెదిరింపు కాల్పులని పోలీసులు అంటున్నారు. కాల్పుల్లో తెలంగాణ సైబర్ క్రైం పోలీసుల పాత్ర ఉన్న నేపథ్యంలో గోప్యంగా విచారిస్తున్నారు. షికారుపాళ్యానికి, తెలంగాణకు రెండు పోలీసు బృందాలను ఉన్నతాధికారులు పంపించారు. కాల్పులు జరిపింది తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులా..? లేక ముఠా సభ్యులా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని షికారుపాళ్యం నకిలీ బంగారు ముఠా సభ్యుల్లో ఒకరిని ఆదివారమే అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. అతని ద్వారా ముఠా గురించి ఆరా తీస్తున్నారు. ఈ కేసు చిక్కుముడి వీడేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది.

ఘోరం..

బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
యువతికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 21: రొద్దం మండలం ఎల్‌జిబి నగర్ సమీపాన పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రొద్దం ఎస్సీ కాలనీకి చెందిన శేషాద్రి(20), అదే మండలంలోని కోగిర గ్రామానికి చెందిన గంగాద్రి(23) మరణించగా.. శేషాద్రి చెల్లెలు దివ్యశ్రీ తీవ్రంగా గాయపడింది. రొద్దం ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు.. హరిజన నరసింహులు కుమారుడు శేషాద్రి ఓ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. తన చెల్లెలు దివ్యశ్రీ డిప్లమో సెకెండియర్ చదువుతోంది. ఆదివారం దివ్యశ్రీ ధర్మవరం నుంచి విజయవాడకు వెళ్లే రైలు మిస్ అయింది. శేషాద్రి ధర్మవరానికి ద్విచక్రవాహనంలో వెళ్లి, ఆమెను ఎక్కించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఎల్‌జిబినగర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహనంలో వస్తున్న హరిజన గంగాధర్ ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శేషాద్రి మృతిచెందాడు.





విలపిస్తున్న శేషాద్రి కుటుంబ సభ్యులు, శేషాద్రి (ఫైల్)

గంగాద్రి, దివ్యశ్రీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున గంగాద్రి చనిపోయాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు శేషాద్రి మృతిచెందడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగింది.

సంక్షిప్తం

నేడు ప్రజా రెవెన్యూ దర్బార్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నభూ సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం ప్రజారెవెన్యూ దర్బార్ భూ సమస్యల పరిష్కార వేదికకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాలసునీత, దర్మవరం ఆర్డీఓ మహేశ్, ఇతర అధికారులు హాజరవుతారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ సమస్యలపై గ్రామసభ

కనగానపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని ముత్తవకుంట్లలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శామ్యూల్ బాబు, సర్వేయర్‌లు కరుణాకర్, శరత్ కుమార్, సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ శ్రీరాములు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యలు పరిష్కరించండి

అనంతపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీలో రహదారులు ఆక్రమణలకు గురయ్యాయని, సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ శివశంకర్ పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో మండల సర్వేయర్ రఘునాథ్‌కు సర్పంచ్ వినతి పత్రం ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేత

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ డీలర్‌తో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అప్పటి రాప్తాడు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబు సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం జీవో జారీ చేశారు. సదరు ఏఓ, జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇవ్వాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుకు ఉత్తర్వులు పంపారు. గత ఏడాది ఆగస్టు నెలలో ఓ డీలర్ నుంచి రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏఓ, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ కేసు పై ఇద్దరు అధికారులు జైలుకు వెళ్లారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో ఈ కేసు నడుస్తోంది.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ సోమవారం కొనసాగింది. ఇప్పటి దాకా 14216 మంది రైతులు 20044 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటిదాకా 19819 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రామగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, కావున ప్రజలు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. పక్కా సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11,230 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

రామగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందిన ఓ విద్యార్థిని కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆమె ఇంటర్ చదువుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిందని రాత్రి అయినా ఇంటికి రాలేదన్నారు. చుట్టు పక్కల ప్రాంతాలు, తెలిసిన వారి ఇళ్లలో ఆరాతీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తల్లిదండ్రులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సుధాకర్ యాదవ్ తెలిపారు.

వాహనాల తనిఖీ

రాప్తాడు: స్థానిక సీఐ టీవీ శ్రీహర్ష సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. మరూరు టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేసి రహదారి నిబంధనలు ప్రజలకు వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలన్నారు.

జేఎన్‌టీయూలో పరేడ్ ఎంపికలు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రీ రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనేందుకు సోమవారం జేఎన్‌టీయూలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ డాక్టర్ శారద ఆధ్వర్యంలో రీజనల్ డైరెక్టర్ పైడా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధరరావు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను రూపొందించామని వారు పేర్కొన్నారు.

ఇనుప మోసానికి అడ్డేదీ..?

- ఐరన్‌షాపుల్లో తూకాల్లో మోసాలు
- తూనికలు, కొలతల శాఖ ముద్ర లేకుండానే కాటాలు
- పట్టించుకోని అధికారులు



నగరంలోని ఓ ఐరన్ షాపు వద్ద కాటా పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఇల్లు కట్టాలన్నా... షాపింగ్ కాంప్లెక్సు నిర్మించాలన్నా ఇనుము తప్పని సరి. దీనికోసం లక్షలు వెచ్చించి బ్రాండెడ్ పేరుతో కొనుగోలు చేస్తుంటారు. బ్రాండ్‌పై చూపిన శ్రద్ధ... తూకాలపై చూపకపోవడంతో ఐరన్ షాపుల నిర్వాహకులు దోపిడీకి తెరలేపుతున్నారు. పలు దుకాణాల్లో తూకాల్లో మోసాలకు పాల్పడుతూ వినియోగదారులను దోచుకుంటున్నారు. ఈ మోసాలు పేరుమోసిన షాపుల్లోనూ జరుగుతు న్నాయి. వేయింగ్ మిషన్లు, కాటాలను పరిశీలించాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారుల దోపిడీకి అడ్డే లేకుండా పోతోంది. కొత్తగా పుట్టుకొస్తున్న షాపుల గురించి చెప్పనక్కర్లేదు. వారికిష్టమొచ్చినట్లు కాటాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

ముద్ర లేకుండానే కాటాలు

సాధారణంగా ఐరన్ షాపులు ఏర్పాటు చేసుకునే సమయంలో తూనికలు, కొలతల శాఖాధికారుల నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలి. ఆ మేరకు సంబంధిత శాఖాధికారులను సంప్రదించి ఐరన్ సముదాయాల్లో ఏర్పాటు చేసుకున్న కాటాలకు ముద్రలు వేయించుకోవాలి. ఆ సమయంలో అధికారులు ఆ కాటాల్లో వెయిట్‌తో పాటు ఏదైనా వ్యత్యాసాలు ఉంటే పరిశీలిస్తారు. అనంతరం వాటికి ముద్ర వేస్తారు. వాటినే వినియోగించాల్సి ఉంటుంది. చాలా మంది నిర్వాహకులు తూనికలు, కొలతలశాఖ కు సంబంధించిన నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ముద్ర లేకుండా ఇష్టమొచ్చినట్లు వేయింగ్ మిషన్లు, కాటాలను ఏర్పాటు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

తనిఖీలతో అడ్డుకట్ట వేస్తాం

ఐరన్‌షాపుల విషయంలో తనిఖీలు చేపడతాం. ఎక్కడైనా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. మొదటిసారి తప్పు జరిగితే జరిమానా విధిస్తాం. అదే పొరపాటు పదేపదే చేస్తే... శాఖాపరమైన కేసులు నమోదు చేస్తాం.

-సుధాకర్, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు, కొలతల శాఖ

సభ్యత్వ నమోదులో టాప్‌లో నిలుద్దాం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన నియోజకవర్గాన్ని పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే టాప్‌లో నిలపడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె పార్టీ బూత్, క్లస్టర్, యూనిట్, ఇన్‌చార్జులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామలింగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.100 కట్టి సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు సభ్యత్వ నమోదు చేసిన ప్రతి కార్యకర్తకు రూ.5లక్షలు బీమా కల్పించి సీఎం చంద్రబాబు అండగా నిలిచారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదులో ముందుండి పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు, వసపల శ్రీరామిరెడ్డి, పాలిని, సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్లు ఆదినారాయణ, అశోక్, పాండు, రామాంజినేయులు, బాలరంగయ్య ఎర్రినాగప్ప, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హంద్రీనీవా ఎస్ఈ నాగరాజు బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఉమ్మడి జిల్లా ఎస్ఈగా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న దేసేనాయక్ నెల్లూరు జిల్లాకు బదిలీకాగా ఆదివారం రిలీవయ్యారు. సోమవారం ఉదయం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో నాగరాజు బాధ్యతలు స్వీకరించారు.

ఆర్ట్స్ కళాశాల అటానమస్ హోదా పొడిగింపు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాలకు మరో పదేళ్లపాటు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదాను పొడిగిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) జాయింట్ సెక్రెటరీ మనోజ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఆర్డర్ కాపీలను సోమవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి పంపారు. దీంతో 2032వరకు అటానమస్ హోదా కొనసాగుతుంది. దీనిపై కళాశాల వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి.

వైసీపీ హయాంలో భూ ఆక్రమణలకు హద్దేలేదు

- ప్రజారెవెన్యూ దర్బార్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలకు హద్దేలేకుండాపోయిందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరిలో సోమవారం ప్రజా రెవెన్యూ దర్బార్-భూసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్, మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి సమస్యలను విన్నవించారు. ఇందులో ఎక్కువగా... భూములను ఆన్‌లైన్‌లో మరొకరి పేరుపై మార్చుకుని కబ్జా చేయడం పై ఫిర్యాదులు అందాయి. రైతు ప్రమేయం లేకుండా మరొకరికి ఆన్‌లైన్‌లో ఎలా మార్చుతారని ఆమె ఆరాతీశారు. మరికొందరు భూ సరిహద్దు సమస్యలు, జగనన్న భూసర్వేలో పెద్దఎత్తున జరిగిన అవకతవకలపై ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం 178 మంది రైతులు ఫిర్యాదులను అర్జీల రూపంలో అందజేశారు. వీటిలో కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలకు సమగ్రంగా సర్వే చేసి తగిన చర్యలుతీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వైసీపీ నాయకులు ప్రజలకు మంచి చేయడం అటు ఉంచితే అమాయక రైతుల పొలాలను కాజేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎక్కువగా ఇలాంటి భూ ఆక్రమణలు ఉన్నాయని, చాలా మంది రైతులు భూముల సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. అందుకే ప్రజా రెవెన్యూ దర్బార్ నిర్వహించామని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే తెలిపారు.

ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ క్యాంపులు

అనంతపురం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలో మంగళవారం నుంచి ఈనెల 25వతేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నారు. 0-5 సంవత్సరాల పిల్లలకు మ్యాండేటరీ ఆధార్, న్యూ ఎన్‌రోల్‌మెంట్ జరుపుతారు. మంగళవారం రాణీనగర్‌లోని ఆశా ప్రైమరీ స్కూల్, హమాలీకాలనీ వార్డు సచివాలయం, 23న గాంధీబజార్‌లోని నెంబర్-2 స్కూల్, హమాలీకాలనీలోని డీటీఆర్ యూపీ స్కూల్, 24న పా తూరులోని 15వ వార్డు స్కూల్, బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర మున్సిపల్ స్కూల్, 25న గాంధీబజార్‌లోని కస్తూర్బాస్కూల్, నెంబర్-1 స్కూల్, నవోదయకాలనీలోని రహమత్ మున్సిపల్ యూపీ స్కూల్‌లో నిర్వహించనున్నారు.

పక్కింటి యువకుడే హంతకుడు..!

అనంతపురం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ కాలనీలో జరిగిన మహిళ హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంటరిగా నివాసముంటున్న గంగమ్మ(నాగమ్మ) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆ ఇంటి పక్కనే ఉంటున్న వాడే హంతకుడిగా గుర్తించినట్లు సమాచారం. అతను శనివారం రాత్రి గంగమ్మ ఉంటున్న ఇంట్లోకి వెళ్లినట్లు తెలిసింది. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించే క్రమంలో ఒప్పుకోకపోవడంతో హత్య చేసినట్లు తెలుస్తోంది. అదే క్రమంలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నట్లు సమాచారం. అతడికి మరో యువకుడు సహకరించడంతో ప్రస్తుతం హరి, ప్రకాశ్ అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో గుట్టు విప్పినట్లు తెలుస్తోంది.

ఉత్తమ కళాకారుడిగా ఓబిలేసు

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల చావట్ల గ్రామానికి చెందిన యనముల ఓబిలేసు ఉత్తమ కళాకారుడు, సామాజిక వేత్తగా అవార్డు పొందారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా శ్రీ ప్రగతి ఫౌండేషన్‌వారు ఈనెల 20న (ఆదివారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతి పంక్షన్ హాలులో నంది అవార్డు అందజేశారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి చేయండి



పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టరును సత్కరిస్తున్న సంఘం సభ్యులు

అనంతపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల సంక్షేమానికి కృషి చేయాలని మండలంలోని సిండికేట్‌నగర్‌కు చెందిన ఆ సంఘం సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్ర పద్మశాలీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీనరసింహులును వారు సన్మానించారు. ఆయన నివాసంలో సంఘం సభ్యులు పుత్తకొండమీదరాయుడు, వెత్త ఎర్రిస్వామి, రాజా తదితరులు కలిసి, పలు సమస్యలను వివరించారు. సంఘం సభ్యులు పుత్త సంగప్ప, అక్కులప్ప, ఆది నారాయణ, అలి, అరవింద్, చిన్నకిండ, లక్ష్మీనారాయణ, జింకా నాగభూషణం, వెంకటేష్, కుమార్‌బాబు, రామలింగ, శ్రీనివాసులు, రామాంజినేయులు, ఈశ్వరయ్య, రమణ, సాయి, మహేష్, ప్రభాకర్, ప్రసాద్, శీనా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమయ్యాయి?: అనంత

అనంతపురం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అత్యాచార ఘటనలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు న్నాయా.. అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం తన నగ్నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగు నెలల వ్యవధిలో 74మంది చిన్నారులు, మహిళల అత్యాచార ఘటనలు జరిగాయంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అని ప్రశ్నించారు.

బిల్లుల స్వాహాపై ఏం చర్యలు తీసుకుంటారు?

కనగానపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మరుగుదొడ్ల బిల్లులు స్వాహా చేసిన వైసీపీ నాయకులపై ఏ చర్యలు తీసుకుంటారని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బాగ్యమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ అనిల్‌కుమార్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పలువురు అధికారులు దుమ్ముకొట్టడం పట్ల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన మరుగుదొడ్ల బిల్లుల స్వాహా కథనంపై మామిళ్లపల్లి ఎంపీటీసీ పెద్దన్న సమావేశంలో లేవనెత్తారు. బిల్లుల స్వాహా చేసిన నాయకులపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సోమదరుడ్డెశేఖర్, అంకే రామకృష్ణ, రాజాకృష్ణ, టీడీపీ రాష్ట్రకార్యదర్శి నెట్టెం వెంకటేశ్, కన్వీనర్ యాతం పోతలయ్య పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కరవు జిల్లాను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీసర్కిల్ ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం సభ్యులు కోరారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం సభ్యులు సోమవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

'పంచాయతీకొక సచివాలయం ఉండాలి'



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేగల కృష్ణమూర్తి, భూషన్‌నాయుడు

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేసి, సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర సంయుక్త సంఘం నాయకులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ సంఘ జిల్లా అధ్యక్షుడు భూషన్‌నాయుడు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు దేగల లలితమ్మ, ఇస్మాయిల్, నాగార్జున, రాజు, శివశంకర్‌రెడ్డి, పెద్దన్న, సీనయ్య, వసంత్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

'ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి'

అనంతపురం విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఇప్పటి నుంచే అడ్మిషన్లు తీసుకోవడం దారుణమని, ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇన్‌చార్జ్ డీఈఓను కోరారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి సోమవారం ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వచ్చే ఏడాది కి ఇంటర్ అడ్మిషన్లు తీసుకోవాలంటూ తమ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులపై ఆయా విద్యాసంస్థలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. అలాగే ఫీజు రాయితీ ఇస్తామని మాయమాటలు చెప్పి...అడ్మిషన్లు తీసుకున్న తర్వాత విజయవాడ, కర్నూలు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి నుంచి లక్షల్లో ఫీజులు పిండి మరో రకంగా కూడా దోపిడీ చేస్తున్నారన్నారు. సంఘం నగర అధ్యక్షుడు మంజునాథ్, ప్రధానకార్యదర్శి ఉమామహేష్, జిల్లా ఉపా ధ్యక్షుడు వంశీ, ఇతర నాయకుల హర్ష, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు తీక్షణ్‌సాయి



ఎంపికైన తీక్షణ్‌సాయి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు నగరానికి చెందిన తీక్షణ్‌సాయి అనే విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన తీక్షణ్‌సాయి అద్భుతమైన ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి డిసెంబరులో భోపాల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు మ రాష్ట్రం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆర్యన్ షూటింగ్ అకాడమీ నిర్వాహకుడు శ్రీకాంత్, కోచ్ శ్రీనివాస్‌లు తీక్షణ్‌సాయి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

చిరస్మరణీయుడు విద్వాన్ విశ్వం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్వాన్ విశ్వంగా ప్రసిద్ధి చెందిన మీసరగండ విశ్వరూపాచారి గొప్ప సాహితీవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా చిరస్మరణీయుడుగా నిలిచారని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. విద్వాన్ విశ్వం 19వ వర్ధంతిని పురస్కరించుకుని మహాకవి గుర్రం జాషువా సాహిత్యపీఠం, తెలుగు వెలుగు సాహితీ సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వెలుగు సాహితీ సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, ఎస్కేయూ తెలుగుశాఖ అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు, మస్తానప్ప, విజయ భాస్కర్‌రెడ్డి, వడ్డే సుధాకర్ పాల్గొన్నారు.

రాయితీ పథకాలను పునరుద్ధరించాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రాయితీ పథకాలను పునరుద్ధరించాలని జాతీయ దళిత హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి రుషింగప్ప ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రుషింగప్ప మాట్లాడుతూ... 2014-19వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం దళితులను ప్రోత్సహించేలా అనేక పథకాలను ప్రవేశపెట్టి రాయితీ రుణాలు అందజేసిందన్నారు. అయితే వైసీపీ గద్దెనెక్కి అన్నిటిని రద్దుచేసి పేదలను రోడ్డున పడేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో తిరిగి వాటిని పునః ప్రారంభించి దళితులను ప్రోత్సహించాలని కోరారు. స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, సోమశేఖర్, నరసింహులు, రామచంద్ర, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. కంబదూరు, కళ్యాణదుర్గం మండలాల్లో కుండపోత కురిసింది. వెలుగుప్పలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మిగతా మండలాల్లో ఆకాశమేఘావృతమైనా వర్షం పడలేదు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

- ప్రజల కోసం అనుక్షణం పాటుపడేది పోలీసులే..! : ఎమ్మెల్యే పరిటాల సునీత
- పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



రామగిరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత, పోలీసులు



బుక్కరాయసముద్రంలో అమరుల కుటుంబాలకు మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

రామగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం అనుక్షణం పాటుపడేది పోలీసులేనని, వారు లేని సమాజాన్ని ఊహించలేమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రామగిరిలో జరిగిన పోలీసు అమరవీ రుల వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోలీసు అమరవీరులకు పరిటాలసునీత మనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రాణాలకూ తెగించి పోలీసులు పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, ఎస్ఐ సుధాకర్ యాదవ్, ఎంపీడీఓ ఆజాద్, టీడీపీ సీనియర్ నా యకులు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ఎంపీపీ వరదామాచారి, మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరంధామయ్య పాల్గొన్నారు.

● బుక్కరాయసముద్రం: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని జంతులూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ పోలీసు బెటాలియన్‌లో సోమవారం జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు కమాండెంట్ ప్రభుకుమార్ హాజరయ్యారు. ముందుగా పోలీసు గౌరవవందనం తీసుకున్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వహించాలని కమాండెంట్ ప్రభుకుమార్ అన్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సత్కరించి అనంతరం మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, టీడీపీ నాయకులు వసపల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: విధినిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు మరువలేనివని రామగిరి సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగామండలంలోని వెల్దుర్తిక్రాస్ వద్ద ఏర్పాటుచేసిన కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి విగ్రహానికి సోమవారం పోలీసులు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది, అమరుడైన సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● రాప్తాడు: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు మరవ లేనివని రాప్తాడు సీఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాప్తాడులో అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించారు. అమరవీరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికేశవ్‌కు ఘన సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హం ద్రీనీవా కాలువ నుంచి తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు పరిశీలన కోసం మండలంలోని ఇంద్రావతి గ్రామానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశ వ్ సోమవారం వచ్చారు. ఆయనకు స్థానిక టీడీపీ శ్రేణులు మాజీ సర్పంచ్ యర్రగుంట్ల వెంకటేశులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు, రాము, నెట్టెం బోస్ తదితరులు పాల్గొన్నారు.

24న ఇంటర్వ్యూలు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ పద్మావతి సోమవారం ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం ప్రాజెక్ట్ పరిధిలోని పోస్టుల భర్తీకి గత సెప్టెంబరు 25 నుంచి ఈనెల 1వతేదీ వరకు దరఖాస్తులు తీసుకున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులకు కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాల్‌లెటర్ అందుకున్న వారు కాల్ లెటర్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అంగన్‌వాడీ పోస్టులు డబ్బుల ద్వారా ఇప్పిస్తామని ఎవరైనా దళారులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఇతర వ్యక్తులు సంప్రదిస్తే వెంటనే 14400 టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు.

14.2 మి.మీ. వర్షపాతం

బెళుగుప్ప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. 14.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేని వర్షాలు కురవటంతో తేమ శాతం ఎక్కువై కందిపంటపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి భూముల్లో సాగుచేసిన కంది పైర్లు దెబ్బతింటాయని వాపోతున్నారు. మరో తుఫాను ఉందని వాతావరణ శాఖ తెలుపుతుండటంతో రైతులు మరింత దిగాలు చెందుతున్నారు.

బాలికల వసతి గృహం ప్రారంభం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో సోమవారం బాలికల వసతి గృహాన్ని కళాశాల పూర్వవిద్యార్థిని, డాక్టర్ సరోజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వసతి గృహం కోసం డాక్టర్ సరోజమ్మ రూ. లక్ష సాయం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు వాణిశ్రీ, జబిలాబి, ఎస్‌ఏ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ఫిర్యాదు

రాయదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్యాలెస్‌రోడ్డులో మటన్‌మార్కెట్‌కు ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని కాలనీవాసులు సోమవారం పలువురికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో పాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు, సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రద్దీగా ఉండే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల రద్దీ అధికమై ట్రాఫిక్ గంటల కొద్దీ స్తంభించిపోతోందన్నారు. అదేవిధంగా సమీపంలో ప్రార్థన మందిరం ఉందని, విద్యార్థులు కూడా ఎక్కువగా దుకాణం ముందు నుంచే వెళుతుంటారని, వారందరూ ఇబ్బంది పడతారని తెలిపారు. మద్యం దుకాణాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కూడేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కూడేరుకు చెందిన వినోద్, దాము, అశోక్ అనే యువకులు సోమవారం ఉరవకొండకు ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. శివరాంపేట వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్ లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక

ఉరవకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వరుణ్‌కుమార్, జ్యోతిరామ్ రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యారు. గుంతకల్లు ఎస్కేపీ కాలేజీలో గత ఆదివారం అండర్-18 జూనియర్ ఖోఖో పోటీలు జరిగాయి. ఇందులో వరుణ్‌కుమార్, జ్యోతిరామ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 25నుంచి 27వతేదీ వరకూ చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పీడీ ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బసవలింగ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదవాలని పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు. కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బజాజ్ ఫిన్ సర్వే సంస్థ వారు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్‌లపై 40 రోజులు పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. వైస్‌ప్రిన్సిపాల్ సురేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

బ్రహ్మసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల వెంకటాపురం సచివాలయాన్ని వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. 2021-2024 మధ్యగల ఆర్‌సీహెచ్ రికార్డులు, గర్భిణు లు, చిన్నారులకు సంబంధించిన ఎంసీహెచ్ రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది గర్భిణులు, చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఆశాకార్యకర్త, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని తరచూ ఆస్పత్రికి తీసుకెళ్లి సుఖవంతమైన కాన్పు జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు డీపీహెచ్ఎన్ హేమలత, జరీనా, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

- నియోజకవర్గవ్యాప్తంగా 416 పనులకు రూ.16 కోట్ల నిధులు మంజూరు
- పల్లె పండుగలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


ఉద్దేహాళ్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో సోమవారం తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్‌నాయక్ పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై వారితో కలిసి సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో 416 అభివృద్ధి పనులకు రూ. 16 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు బొమ్మనహాళ్ మండలానికి 83 పనులకు రూ. 3 కోట్లు, కణేకల్లు మండలానికి 93 పనులకు రూ. 4.1 కోట్లు, డీ.హీరేహాళ్ మండలానికి 71 పనులకు రూ. 2.75 కోట్లు, గుమ్మఘట్ట మండలానికి 105 పనులకు రూ. 3.1 కోట్లు, రాయదుర్గం రూరల్ మండలానికి 64 పనులకు రూ.2.55 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో సౌకర్యాలు మెరుగు పరచడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, ముల్లంగి నారాయణస్వామి, తిమ్మరాజు, నవీన్, హనుమంతు, సంగప్ప, సల్లాపురం బాబు, పయ్యావుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో పల్లెపండుగ నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతోందన్నారు. పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ప్రభాకర్, శరభనగౌడ్, అశోక్, యువరాజ్‌గౌడ్, హరి, నరేష్ ఎంపీటీసీ నరేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని టీ వీరాపురం గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో పల్లె పండుగ జరిగింది. ఇందులో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. పల్లెపండుగలో భాగంలో గ్రామంలో 315 మీటర్లు సీసీరోడ్ల నిర్మాణానికి దాదాపు రూ. 15 లక్షల నిధులు కేటాయించిందని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ డీఏ సుధాకర్‌నాయక్, హౌసింగ్ డీఈ రంగస్వామి, ఐకేపీ ఏసీ గోవిందప్ప, ఎంపీడీఓ కొండన్న, టీడీపీ నాయకులు సుంకన్న, గంగాధరశెట్టి, గంగప్ప, సర్పంచులు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, కాటా వెంకటేశులు, రామస్వామి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది: డీఎస్పీ


కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అంజలి ఘటిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని డీఎస్పీ రవిబాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో గల పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద సోమవారం ఆయన ఆధ్వర్యంలో పోలీ సు సిబ్బంది అంజలి ఘటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీసు అమరవీరుల త్యాగాలను ఎన్నటి కీ మరువలేమన్నారు. వారి ఆశయాల సాధన కోసం అందరూ పాటుపడదామని పిలుపునిచ్చారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఎస్‌ఐ శివ, సిబ్బంది అంజలి ఘటించారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసుఅమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. దేశరక్షణలో భాగంగా ప్రజల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో అమరులైన పోలీసు వీరుల త్యాగం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్‌వలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయలచెరువులో రక్తదానం

యాడికి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాయలచెరువులో లయన్స్‌క్లబ్, లియోక్లబ్ వారు రక్తదానశిబిరం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు హాజరై మాట్లాడారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. సమాజంలో పోలీసుల పాత్ర అనిర్వచనీయమని తెలిపారు. తర్వాత శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. యాడికి సీఐ ఈరన్న, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ, సెక్రటరీ రామకృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ అధికారిపై ఆరా

ఆంధ్రజ్యోతికి స్పందన

పుట్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి నియంత పాలనపై సోమవారం ఆంధ్రజ్యోతిలో చెప్పినట్లు వినాల్సిందే అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై డీఆర్వో కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు స్పందించి ఆ అధికారి ఎవరని ఆరాతీసినట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే వీఆర్వోలతో ఆ అధికారి గురించి సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఆయన చేసిన పనులపై అడిగి తెలుసుకున్నట్లు, మండలంలో ప్రస్తుతం ఎంతమంది విధులకు హాజరయ్యారు, ఎంతమంది బదిలీపై వచ్చారు, ఎవరు ఎక్క డెక్కడ బాధ్యతలు తీసుకున్నారని ఆరాతీసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ నియంత అధికారిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

బీటీపీకి 1211 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాయదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భైరవాని తిప్ప ప్రాజెక్టుకు సోమవారం 1211 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఏఈ సాయిరామ్ తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం రెండు టీఎంసీలు ఉండగా నీటిమట్టం 1655 అడుగులకు గాను 1651 అడుగుల మేరకు వరద నీరు చేరాయి. రెండురోజులుగా ఎగువన కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో కురుస్తు న్న వర్షాల కారణంగా వరదనీరు డ్యాంలోకి వచ్చి చేరుతున్నాయి.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెళుగుప్ప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామంలో పేకాట కేంద్రంపై సోమవారం తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ శివ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 2950ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చౌడమ్మ ఆలయంలో చోరీ

పుట్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లి గ్రామశివారులో ఉన్న చౌడమ్మ ఆలయంలో సోమవారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు దొంగ చోరీకి పాల్పడిన వీడియోలను పోలీసులు విడుదల చేశారు. పట్టపగలే దుండగుడు ఆలయ తలుపులకున్న తాళాన్ని రాయితో పగలగొట్టి లోపలికి చొరబడ్డాడు. హుండీలోని రూ.10వేలు నగదు, రెండు జతల ఇత్తడి దీపాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వీటివిలువ రూ.18వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

కాపర్ చోరీపై ఫిర్యాదు

బెళుగుప్ప, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపల్లిలో రైతు రమేష్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్‌ను అపహరించారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ గంగాధర సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

ఆధారాలున్నా.. కళాశాలపై చర్యలేవీ ?

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అనేక అవకతవకలు జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ పట్టణంలోని సీవీఆర్‌టీ ఇంజనీరింగ్ కళాశాలపై నాక్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక తన నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాశాలలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఒకరిస్థానంలో మరొకరు పరీక్షలు రాయిస్తున్నారని, యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, సరైన విద్యను అందించడం లేదని పేర్కొన్నారు. నాక్ అధికారులు మధ్యవర్తి ద్వారా ఒక లాడ్జిలో యాజమాన్యంతో కలవడం చాలా దారుణమన్నారు. అదేవిధంగా పెనుగొండ కియా పరిశ్రమ సమీపంలో ఒక హోటల్ వద్ద వీరు విందులో పాల్గొనడం దేనికి సంకేతమని మండిపడ్డారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ తదితరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో ఎస్పీ జగదీష్ కలిసి ఈ అన్యాయాలపై వివరిస్తానని తెలిపారు.

నమ్మించి మోసం చేశాడని ఫిర్యాదు

యల్లనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో ఓబులేసు అనే వ్యక్తి తనను నమ్మించి మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం సాయంత్రం తమకు ఫిర్యాదు చేసిందని, ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి ఓబులేసు ప్రేమిస్తున్నట్లు నటించి వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఉన్నం నివాళి


రామన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మిషన్ రామన్న అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి రామన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మాజీ సర్పంచ్ మృతి ..

గుంతకల్లుటౌన్: మండలంలోని నాగసముద్రం గ్రామంలో టీడీపీ మద్దతుదారుడు, మాజీ సర్పంచ్ ఓబులప్ప సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ ఆదేశాల మేరకు యువనాయకుడు అనిల్ గౌడ్ ఆ గ్రామానికి వెళ్లి ఓబులప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం వితరణ

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ. 50 వేలు విలువ చేసే విగ్రహాన్ని వితరణ చేసినట్లు నేమకల్లు వాల్మీకి సంఘం నాయకులు సోమవారం తెలిపారు. ఇటీవల కాలవ శ్రీనివాసులును సంప్రదించి విగ్రహ ఏర్పాటు గురించి వివరించామన్నారు. స్పందించిన ఆయన వాల్మీకి విగ్రహాన్ని వితరణ చేశారన్నారు. ఈ నెల 26న విగ్రహ ఏర్పాటు జరుపుతామని వారు పేర్కొన్నారు.

నేడు పవర్ కట్

గుంతకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద గల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడనుందని ట్రాన్స్‌కో డీఈఈ నాగేంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పవర్ కట్ ఉంటుందన్నారు. రాజేంద్రనగర్, ఎస్ఎల్వీ థియేటర్, రామస్వామి గుడి వీధి, తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, కాలువలను శుభ్రపరచాలనిడిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని మున్సిపల్ కమీషనర్ జబ్బర్‌మియాకు అందజేశారు. పట్టణ కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

పయ్యావుల కేశవ్ కాలనీ ఏర్పాటుకు ఆమోదం

ఉరవకొండ,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగనన్న కాలనీ పేరును పయ్యావుల కేశవ్ కాలనీగా మార్చాలని పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్వసభ్యసమావేశం సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగింది. స్థానిక జగనన్న కాలనీని పయ్యావుల కేశవ్ కాలనీ ఏర్పాటు చేయాలని అజెండాలో పొందుపర్చగా.. మెజార్టీ సభ్యులు మద్దతు తెలిపి తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో ఈవో గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీ సభ్యుడి అరెస్టు

డీ.హీరేహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు కర్ణాటక తరలిస్తూ సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి స్థానిక బళ్లారి-బెంగుళూరు హైవేపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలోనే బళ్లారి వైపు నుంచి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మహేష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 28 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆ ద్విచక్ర వాహనాన్ని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎంపీటీసీ సభ్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెరువుభూమిని కాపాడాలని వినతి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లికి సంబంధించిన చెరువు భూమిని కొందరు కబ్జా చేశారని, కాపాడాలని గ్రామస్థులు పలువురు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో తహసీల్దార్ నాగరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన 13 మంది లబ్ధిదారులకు రూ. 6,16,732ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సీఎం చంద్రబాబు చికిత్స కోసం ఆసుపత్రులకు డబ్బు ఖర్చుచేసిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను తీసుకురావడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు ఈశ్వర్, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, తలారి మస్తానప్ప, గుమ్మనూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతకోటలో ఎమ్మెల్యే పర్యటన


ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతకోటలో సోమవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరాతీశారు. మార్కెట్ సమీపంలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గదులు ఖాళీగా ఉండడంపై నాయకులతో ఆరాతీశారు. ఆయన వెంట పవన్‌కుమార్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, వరదయ్య, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, చింబిలి ప్రసాద్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరహాలు తోట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన ఆదినారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నరేష్ (21) గ్రానైట్ బండలను పరిచే పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా ఆదివారం రాత్రి సజ్జలదిన్నెకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా వరహాలు తోట వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలవడంతో స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పెద్దపప్పూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నె, పెద్దపప్పూ రు, జోడిధర్మాపురం, దేవునిఉప్పలపాడు, చెర్లోపల్లి, చాగల్లు, తబ్జుల, పెండేకల్లు, అత్తిరాళ్లదిన్నె గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామసభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాలాజీరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. భూసమస్యలున్న రైతులు పాల్గొని సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

పెద్దవడుగూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని షాదీఖానాలో సోమవారం ఏర్పాటుచేసిన సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి జాఫర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు.ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని కోరారు. సీపీఐను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు సమీపంలో సోమవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి నంద్యాలజిల్లా అవుకు, చెర్లోపల్లి గ్రామాలకు చెందిన మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు మహేష్, నాగార్జున, మదన్‌లపై కేసు నమోదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కళ్యాణదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ధర్మవరం రోడ్డులో ఉన్న అక్రమ కట్టడాన్ని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. కట్టడం చేపట్టిన వారికి ముందస్తుగా నోటీసులు అందించామని, వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేసినట్లు కమిషనర్ తెలిపారు. పట్టణంలో మరిన్ని అక్రమ కట్టడాలను కూడా కూల్చివేస్తామన్నారు. ఇక్కడ సుమారు 32 అనధికారిక లేఔట్లను గుర్తించామని, వాటిపై కూడా త్వరలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టే వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భవనాన్ని నిర్మించండి

బొమ్మనహాళ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆరోగ్యకేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుందని, దాన్ని తొలగించి, కొత్తభవనం నిర్మించాలని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కోరారు. ఉద్దేహాళ్‌కు సోమవారం ఎమ్మెల్యే వచ్చారు. ఆరోగ్య కార్యకర్తలు ఆయన్ను కలిసి ఈ మేరకు విన్నవించారు.